సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 27 । నవంబర్ । 2023



కార్తీక వెలుగులు
కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం జిల్లా అంతటా శైవక్షేత్రాలు దీపాలతో దేదీప్యమానంగా మారాయి. 8లో



రాజ్యాంగాన్ని పరిరక్షిద్దాం
రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.2°/20.3°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమైంది. కొన్ని చోట్ల తేలికపాటి వర్షపాతం నమోదైంది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' ఉంటుంది. ఈ మేరకు పోలీసు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

ఘనంగా గిరి ప్రదక్షిణ



కార్తీక దీపాల వెలుగులో సత్యసాయి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి పురవీధుల్లో 'సాయి ఈశ్వర నమామి కరుణించి కాపాడవయ్యా' అంటూ భక్తజన ఘోష మార్మోగింది. ఆదివారం పవిత్ర కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సత్యసాయి గిరి ప్రదక్షిణ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేశ విదేశాలకు చెందిన భక్తజనం పాల్గొన్నారు. ప్రశాంతి నిలయం గణేష్ గేట్ ముందు సత్యసాయి బాబా చిత్రపటం ఉంచిన రథాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కాయ, కర్పూరం సమర్పించి పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు పట్టుకుని రథాన్ని లాగారు. విద్యాగిరి, సత్యసాయి విద్యా సంస్థలు, కలెక్టరేట్, గోకులం, ఎనుములపల్లి గణేష్ సర్కిల్, ప్రశాంతి పెట్రోల్ స్టేషన్, కమ్మవారిపల్లి చింతతోపు, పెద్దబజార్, శివాలయం వీధి, హనుమాన్ సర్కిల్, గోపురం వీధి మీదుగా గిరులను తిరుగుతూ ప్రశాంతి నిలయం ముంగిట వరకూ ప్రదక్షిణ నిర్వహించారు.

సర్పంచ్ భర్తపై దాడి

కదిరి అర్బన్: మండల పరిధిలోని వై కొత్తపల్లిలో శనివారం రాత్రి గ్రామ సర్పంచ్ శుభలేఖ భర్త విశ్వనాథ్‌పై అదే గ్రామానికి చెందిన రామ్మోహన్ అనే వ్యక్తి క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు విశ్వనాథ్ వివరాల మేరకు.. విశ్వనాథ్ రాత్రి కదిరిలోని పాఠశాల నుంచి పిల్లలను ద్విచక్ర వాహనంలో తీసుకుని ఇంటికి వెళ్తుండగా దారిలో మద్యం సేవించిన రామ్మోహన్ వెంబడించాడు. గ్రామంలోకి రాగానే కొడవలి, క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశాడు. కేకలు వేయగా బంధువులు, గ్రామస్తులు వచ్చి అడ్డుకున్నారు. గాయపడిన విశ్వనాథ్‌ను చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విశ్వనాథ్ తెలిపారు. కాగా రామ్మోహన్ కుమారుడు గతంలో అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జైలుకెళ్లాడని, ఆ కేసులో తన ప్రమేయం ఉందనే అనుమానంతో ఈ దాడికి పాల్పడ్డట్లు చెప్పారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరి నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి: స్థానిక నవోదయ విద్యాలయంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంగీత రీతులు హిందూస్తానీ, కర్ణాటక మ్యూజిక్‌ల్లో అభిరుచి కలిగించేందుకు వాద్య సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ప్రముఖ వేణువు వాయిద్యకారులు డాక్టర్ అనంతకృష్ణ తోటి కళాకారులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంత కృష్ణ (వేణువు), వి.లక్ష్మి (వేణువు), బాలసుబ్రమణ్యం (మృదంగం), రఘురాం (ఘటము) వాయిద్యాలతో అన్నమాచార్య సంకీర్తనలతో అందరినీ అలరించారు.

రెండు రోజుల క్రితం కర్ణాటక నుంచి డీజిల్ తరలిస్తున్న రెండు బొలెరో వాహనాలను కియా పరిసర ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేసి వాణిజ్య పన్నుల శాఖాధికారులకు అప్పజెప్పారు. జరిమానా చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

గతేడాది డిసెంబరులో కర్ణాటక నుంచి 6 వేల లీటర్ల డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను కియా పోలీసులు పట్టుకున్నారు. పావగడలో ట్యాంకర్ నింపినట్లు గుర్తించారు. ఎలాంటి పన్ను చెల్లించకుండా రాష్ట్రంలోకి తీసుకొస్తున్నట్లు గుర్తించారు. జరిమానా విధించారు.



ఇంధనం పక్కదారి

అక్రమంగా డీజిల్ తరలిస్తూ పట్టుబడిన బొలెరో (ఫైల్)

- కర్ణాటక నుంచి యథేచ్ఛగా డీజిల్ అక్రమ రవాణా
- నకిలీ బిల్లులతో పన్ను చెల్లించకుండా తరలింపు
- ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు టీడీపీ నాయకుల లీలలు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- లోపించిన వాణిజ్య పన్నుల శాఖ పర్యవేక్షణ

సాక్షి, పుట్టపర్తి: అదును దొరికితే చాలు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కాసులకు కక్కుర్తి పడుతూ నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. ఇటీవల కొత్త పంథాలో డీజిల్ దందాకు తెరదీశారు. ఎలాంటి సుంకం చెల్లించకుండా కర్ణాటక నుంచి జిల్లాకు తీసుకొస్తున్నారు. ట్యాంకర్లు, బొలెరో వాహనాల ద్వారా నిత్యం తరలిస్తున్నారు. నకిలీ బిల్లులు చూపిస్తూ దర్జాగా దందాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు టీడీపీ నేతల అండతో డీజిల్ దందా చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పెనుకొండ మీదుగా దందా ఎక్కువగా సాగుతోందని సమాచారం.

భారీగా దిగుమతి

కర్ణాటక నుంచి మన రాష్ట్రానికి డీజిల్ తేవాలంటే తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కొందరు స్మగ్లర్లు నకిలీ బిల్లులు సృష్టించి రోజూ వేలాది లీటర్ల డీజిల్‌ను జిల్లాకు తీసుకొస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ సుమారు 5 వేల లీటర్ల నుంచి 10 వేల లీటర్ల వరకు తీసుకొస్తున్నాయి. దొడ్డిదారిన పోలీసులకు దొరక్కుండా జిల్లాలోకి చొరబడుతున్నాయి. అధికారుల అలసత్వం కూడా అక్రమార్కులకు కలిసివస్తోంది.

లోపించిన నిఘా

అక్రమ డీజిల్ రవాణాను అరికట్టాల్సిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, పోలీసులు చూసీ చూడనట్లు పోతున్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు సులువుగా తమ పని కానిచ్చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 10 వేల లీటర్ల డీజిల్ అక్రమంగా తీసుకొస్తూ దొరికితే రూ.2 లక్షల వరకు జరిమానా విధించాల్సి ఉంటుంది. కానీ కొందరు అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై కేసులు నమోదు చేయకుండా వదిలిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులైనా ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



డీజిల్ స్మగ్లింగ్‌ను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తాం. వాణిజ్య పన్నుల శాఖతో కలిసి దాడులు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తాం. స్మగ్లర్లపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదం మోపుతాం. పోలీసు శాఖలో ఎవరైనా అక్రమార్కులకు పాల్పడినట్లు తేలితే ఉపేక్షించం. కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి

పుట్టపర్తి అర్బన్: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాయని ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం బొంతలపల్లి, చెర్లోపల్లిలో ఆదివారం 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర ప్రారంభించారు. మొబైల్ ప్రచార రథాల ద్వారా పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శాఖలో ఆయుష్మాన్ భారత్, మాతృత్వ యోజన, మాతృత్వ వందన, సురక్ష కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి ప్రసంగించారు. గ్రామంలో 141 మంది లబ్ధి పొందారన్నారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేల చొప్పున 220 మంది రైతులకు లబ్ధి చేకూరిందని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డ్, నానో ఎరువులు అందజేసినట్లు చెప్పారు. వివిధ బ్యాంకుల ద్వారా అర్హులందరికీ రుణాలు అందించినట్లు ఎల్డీఎం రమణకుమార్ పేర్కొన్నారు. బొంతలపల్లిలో నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు అధికారులు జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, సర్పంచులు లీలావతి, శ్రీనివాసులు, ఎంపీటీసీ కుల్లాయప్ప, జిల్లా పశువైద్యాధికారి సుభదాస్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, నోడలాఫీసర్ శివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, డీటీ రమేష్, ఎంఈఓ ఖాదర్‌వలి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు హరికృష్ణ, కొండమరాజు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా జ్వాలా తోరణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జ్వాలా తోరణ మహోత్సవం కనులపండువగా సాగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో స్వామి ఉయ్యాలోత్సవం కూడా వైభవంగా జరిగింది. అనుబంధ ఆలయాలైన శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ జ్వాలాతోరణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్:



ఉయ్యాలోత్సవంలో ఖాద్రీశుడు



జ్వాలాతోరణాన్ని తిలకిస్తున్న భక్తులు

నేడు లేపాక్షిలో కృష్ణ సంగీత ఉత్సవాలు



నంది విగ్రహం వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

లేపాక్షి: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో సోమవారం లేపాక్షిలో కృష్ణ సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. నంది విగ్రహం వద్ద సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్వాన్ వినయ్ సర్వ ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర కచేరీ బృందం, విద్వాన్ వైభవ్ రమణి (వయోలిన్), విద్వాన్ బీయస్ ప్రశాంత్ (మృదంగం), విద్వాన్ గోపి శ్రవణ్ హాజరవుతారని తెలిపారు. డిసెంబరు 10 నుంచి 12 వరకూ విజయవాడలో జరగనున్న కృష్ణ సంగీత ఉత్సవాలకు ముందస్తుగా లేపాక్షి, బొబ్బిలి (విజయనగరం) వేణుగోపాల్ స్వామి దేవాలయం, రాజమండ్రి (తూర్పు గోదావరి) ఆనం కళాక్షేత్రం, మొవ్వ (కృష్ణా) వేణుగోపాల స్వామి, నెల్లూరు రంగనాథస్వామి దేవాలయం, కర్నూలు ప్రభుత్వ సంగీత కళాశాలల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనతో పాటు కేంద్ర పర్యాటక శాఖ అధికారి చంద్రనాయక్, సంగీత నాటక అకాడమీ పవన్‌ఝా కార్యనిర్వాహకులుగా వ్యవహరిస్తారని, కార్యక్రమంలో పాల్గొని సంగీత సుస్వరాలను ఆస్వాదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు భరోసా

- ప్రతి వాహనానికీ ఇన్సూరెన్స్ తప్పనిసరి
- రోడ్డు ప్రమాద సమయంలో ఉపయోగకరం
- వాహనాలు పట్టుబడకపోయినా పరిహారం
- మృతి చెందిన వారికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు
- 'హిట్ అండ్ రన్ రోడ్ యాక్సిడెంట్–2022'ను అమల్లోకి తెచ్చిన కేంద్రం



అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. 'హిట్ అండ్ రన్ రోడ్డు యాక్సిడెంట్–2022' ద్వారా బాధితులను ఆదుకోవాలని నిర్ణయించింది. యాక్సిడెంట్‌కు కారణమైన వాహనాలు, నిందితులు పట్టుబడకపోయినా పరిహారం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టి చనిపోతే రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం కేంద్ర ప్రభుత్వం అందించనుంది.

ఇన్సూరెన్సు తప్పనిసరి

రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి వేదన వర్ణనాతీతం. ఏటా జిల్లాలో వందల్లో మృతి చెందుతుంటే... వేలాదిమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం.. రోడ్డు నిబంధనల పాటించకపోవడం తదితర కారణాలతో ఎక్కడో ఒక చోట ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ పథకాలు తీసుకొచ్చాయి. గాయపడినా.. మృతి చెందినా ప్రమాదాలకు కారణమైన వాహనాల ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి పరిహారాన్ని క్లెయిమ్ చేసుకునే హక్కు కల్పించాయి. ఇన్సూరెన్స్ స్కీములు బాధితులకే కాకుండా వాహన యజమానులకు కూడా భరోసా కల్పిస్తున్నాయి. అందుకే ప్రతి వాహనానికీ ఇన్సూరెన్స్ తప్పనిసరి చేశారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులు ఆరు నెలల్లోపు ఘటనాస్థలం పరిధిలోని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఆధార్ ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను జత చేసి వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేయాలి. తహసీల్దార్ పరిశీలించిన వెంటనే కలెక్టర్‌కు నివేదిస్తారు. రోడ్డు సేఫ్టీ సమావేశంలో చర్చించిన తర్వాత కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను జారీ చేస్తారు. ఢిల్లీలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పరిహారం మంజూరవుతుంది. 2022 సంవత్సరంలో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ సరైన ప్రచారం, అవగాహన లేమితో జిల్లాలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఈ స్కీము ద్వారా పరిహారం రాలేదు. అయితే దరఖాస్తు కూడా చేసుకోకపోవడం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా దురదృష్టవశాత్తు ఘటనలో బాధితులుగా మారిన వారిని ఆదుకోవడంపై కూడా దృష్టి సారిస్తున్నాం. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'హిట్ అండ్ రన్ రోడ్డు యాక్సిడెంట్–2022' పథకంపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. రెండేళ్లుగా ఈ స్కీము ఉన్నా ప్రజలకు తెలియకపోవడం బాధాకరం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్, అనంతపురం

నేడు, రేపు శాస్త్రవేత్తల బృందం పర్యటన

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించనుంది. ఈ మేరకు రైతు సాధికార సంస్థ అధికారులు పేర్కొన్నారు. మొదటి రోజు హిందూపురం మండలం చలివెందుల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే ఘన, ద్రవ, బీజామృతం తయారీని పరిశీలించిన అనంతరం వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తారు. కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. సాధిస్తున్న ఫలితాలు, పురోగతిని తెలుసుకుంటారు. రెండో బృందం పెనుకొండ మండలం కోట్లపల్లిలో పర్యటిస్తుంది. మంగళవారం బత్తలపల్లి మండలం గంటాపురంలో శాస్త్రవేత్తలు పర్యటిస్తారు. విత్తన గుళికల తయారీ ప్రక్రియ తెలుసుకుంటారు. ఏటీఎం, డ్రాట్ ప్రూఫ్ మోడల్స్‌ను సందర్శించి రైతులతో ముచ్చటిస్తారు. యువ రైతులు, రైతు పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి వ్యవసాయ విస్తరణ, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు.

ఘనంగా చిత్రలింగేశ్వరుని ఉత్సవాలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో యాదవ కులస్తుల ఆరాధ్య దైవం చిత్రలింగేశ్వరస్వామి, యత్తయ్యల ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు. అనంతరం జలధి ఉత్సవానికి ఉప్పవంక వద్దకు తరలివెళ్లారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొందరు భక్తులు ఆయా గ్రామాల నుంచి కాలినడకన ప్రసాదం తీసుకొచ్చి స్వామివార్లకు సమర్పించారు. వందలాదిగా భక్తులు తరలి రావడంతో తమ్మడేపల్లి గ్రామం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

'తాడిపత్రిలో టీడీపీ గెలవదు'



మాట్లాడుతున్న జిలాన్‌బాషా

తాడిపత్రిటౌన్: వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో టీడీపీ గెలిచే పరిస్థితి లేదని ఆ పార్టీ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జిలాన్ బాషా అన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీని ప్రజలు అసహ్యించుకునే స్థాయికి దిగజార్చారని విమర్శించారు. ఆదివారం ఉదయం టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులుకు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖ పంపానన్నారు. అనంతరం పట్టణంలోని చింతల వేంకటరమణస్వామి ఆలయ ధర్మకర్త కందిగోపుల మురళీప్రసాద్ రెడ్డి ఇంట్లో జిలాన్ బాషా మీడియాతో మాట్లాడారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లను పక్కనపెట్టి, విలువలు లేని వారితో సోషల్ మీడియా వేదికగా సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడిస్తూ టీడీపీని ప్రజల్లో చులకన చేసేశారన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన ఈ మూడేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా సమస్యలు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. ఈసారి ఎన్నికల్లో కార్యకర్తలు కూడా టీడీపీకి ఓటు వేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించారన్నారు. సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

1న వేలం పాట

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు, లడ్డు ప్రసాదం ఇచ్చే కవర్లు, విద్యుత్‌సామగ్రి సరఫరా చేసే హక్కులకు డిసెంబర్ 1న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు సమర్పించే తలనీలాలు ప్రోగుచేసుకునే హక్కు ఏడాది పాటు రూ.30 వేలు డిపాజిట్, లడ్డు ప్రసాదము ఇచ్చే కవర్ల హక్కు ఏడాది పాటు రూ.25 వేలు, విద్యుత్ సామగ్రి వస్తువులు సప్లయ్ చేసే హక్కు మూడు నెలల పాటు రూ. 25 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు శ్రావణి

ఎన్‌పీకుంట: కుటుంబ పోషణ భారమై, మనస్తాపంతో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎర్రవంకలవారిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఎర్రవంకలవారిపల్లికి చెందిన పిడుగు శ్రావణి (22) భర్త పిడుగు వెంకటశివ ఏడాది క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వారికి 2 సంవత్సరాలు, 18 నెలలు ఉన్న ఇద్దరు బిడ్డలు ఉన్నారు. భర్త మరణించడంతో కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో శ్రావణి బాధపడేది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా శ్రావణి మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని స్నేహలతనగర్‌కు చెందిన అమర్‌నాథ్ రెడ్డి (45) అనే వ్యక్తి మృతి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానికంగా ఉంటున్న గాజుల శీన, మరిగమ్మ మరికొంత మంది తన కుమారుడిపై ఈ నెల 12న దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 14న చనిపోయినట్లు మృతుడి తల్లి సావిత్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థానిక శ్మశాన వాటికను పోలీసులు సందర్శించారు. సోమవారం వైద్య బృందం పర్యవేక్షణలో పోస్ట్ మార్టం నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు.

కార్తీక వెలుగులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం ఆయా ప్రాంతాల్లో వెలసిన ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొన్ని చోట్ల గ్రామస్తులంతా కలసి కార్తీక వన భోజనాలు చేశారు.

– సాక్షిబృందం


ప్రత్యేక అలంకరణలో భక్తరహళ్ల లక్ష్మీనరసింహస్వామి


పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్‌లో శ్రీచక్రం రూపంలో దీపాలను వెలిగించిన భక్తులు


హిందూపురం: అలంకరణలో రంగనాథస్వామి


సోమందేపల్లి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


హిందూపురం: గుడ్డంలోని శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో 21 గొర్రెల మృతి

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి లోని కెంచగానహళ్లి గేటు వద్ద ఆదివారం తెల్లవారు జామున సుమారు 4.30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 21 గొర్రెలు చనిపోయాయి. పోలీసుల వివరాలమేరకు.. పళవల్లి గ్రామానికి చెందిన దొడ్డ తిమ్మయ్య గొర్రెల మందను కదిరిదేవరపల్లికి తలరలిస్తుండగా మార్గమధ్యలోని కెంచగానహళ్లి గ్రామం గేటు వద్ద పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించక పోవడంతో వైఎస్ హొసకోట నుంచి బెంగళూరుకు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు గొర్రెల మందపై దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో 21 గొర్రెలు చనిపోయినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు. సుమారు రూ. 2 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు దొడ్డ తిమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే జగదీష్ కన్నుమూత


జగదీష్ (ఫైల్)

గుంతకల్లు: మాజీ ఎమ్మెల్యే అరికేరి జగదీష్ (85) ఆదివారం హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉంది. 1981 నుంచి 89 వరకు రెండు సార్లు గుంతకల్లు మున్సిపల్ చైర్మన్‌గా, 1989 నుంచి 1994 వరకు గుత్తి ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా పని చేసి ప్రజల మన్ననలు పొందారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత


పుట్టపర్తి: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ


పుట్టపర్తి: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఓ కొండయ్య


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని అందుకు ప్రతి భారతీయుడూ తన వంతు కృషి చేయాలని డీఆర్ఓ కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్ లోని డీఆర్ఓ చాంబర్‌లో నిర్వహించారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ గ్రంథంలోని ప్రతిజ్ఞను ఆయన చదివి వినిపించారు. అనంతరం న్యాయ చట్టాల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఆనంద్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిద్దాం

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఆర్డీఓ కార్యాలయంతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎంతో విలువైనదని, దేశ ప్రజలకు దిశా నిర్దేశం చేస్తున్న ఒక ఉన్నత గ్రంథమన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అందులోని సారాన్ని అమలు చేయాలన్నారు. ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ జిలానీ, డీటీ నరసింహులు, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ మధుసూధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం గొప్ప మార్గ నిర్దేశం

పుట్టపర్తి టౌన్: దేశ పౌరులకు భారత రాజ్యాంగం దిశా నిర్దేశం చేస్తున్న గొప్ప గ్రంథమని అడిషనల్ ఎస్పీ విష్ణు తెలిపారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత అడిషనల్ ఎస్పీ విష్ణు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ సమానంగా హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల వల్లనే నేడు రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు టైటాస్, రాజుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ అనుచరురాలిపై కేసు నమోదు

తాడిపత్రి: సామాజిక మాధ్యమాలు వేదికగా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ముఖ్య అనుచరురాలు, టీడీపీ నాయకురాలు కొంకరి కమలమ్మపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దిన్నె సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. టీడీపీకి చెందిన కొంకరి కమలమ్మ ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అగౌరవ పరిచేలా, పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులను కలచివేసే విధంగా ఉండడంతో పాటు పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మాబు(46), బాషా ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం అనంతపురంకు బయలు దేరారు. బీకేఎస్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలో బొమ్మలబావి దగ్గర అనంతపురం – తాడిపత్రి రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేస్తూ డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా వాహనం నడుతున్న బాషా హెల్మెట్ ధరించడంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ పోటీలను ఆదివారం పోటాపోటీగా జరిగాయి. అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించగా ఆయా జిల్లాల నుంచి 185 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతి కేటగిరిలోనూ టాప్–2 క్రీడాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, హైకోర్టు అడ్వకేట్ దీపక్ దయానంద్, ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం చెస్ అసోసియేషన్ చైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివ కుమార్, కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అనంతపురం క్రైం: స్థానిక నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పీవీకేకే కళాశాల సమీపంలో సాయి హేమలత (28) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.... పెనుకొండకు చెందిన సాయి హేమలతను కళ్యాణ్ అనే యువకుడికి ఇచ్చి 9 నెలల క్రితం వివాహం జరిపించామన్నారు. పెళ్లి సమయంలో పెద్ద మొత్తంలో నగదు, బంగారు వరకట్నం కింద ఇచ్చామని తెలిపారు. యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోందని, ప్రతి నెలా ఆమెకు వచ్చే జీతంలో ఒక్క రూపాయి కూడా ఉంచకుండా కళ్యాణ్ తన ఖాతాలోకి మళ్లించుకునేవాడన్నారు. అదనపు కట్నం కోసం పలుమార్లు వేధించినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం కళ్యాణ్ తన తల్లిదండ్రులతో కలసి ఉత్తర కర్ణాటక ప్రాంతానికి విహార యాత్రకు వెళ్లాడని, హేమలతను వెంట తీసుకెళ్లలేదన్నారు. ఈ క్రమంలో ఇంట్లో హేమలత, మరిది, వరుసకు అవ్వ అయిన ఓ వృద్ధురాలు ఉంటున్నారని, ఏం జరిగిందో తెలీదని ఆదివారం సాయంత్రం హేమలత ఫ్యాన్‌కు ఉరితాడుతో చనిపోయి కనిపించిందన్నారు. వరకట్నం వేధింపులే తమ బిడ్డ చావుకు కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్గో డెలివరీలో ప్రథమ స్థానం


లక్కీడిప్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కార్గో డెలివరీలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన లక్కీడిప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి డిపో టార్గెట్ 2000 కాగా 2050 కార్గో పార్శిల్‌లు బుక్ చేసి 103 శాతంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం లక్కీ డిప్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తర్వాత కదిరి డిపో నుంచి అరుణాచలానికి ఏర్పాటు చేసిన నాలుగు ప్రత్యేక బస్సులను జెండా ఊపీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ డిపీఎం హరిమోహన్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రైతును రక్షించిన పోలీసులు

● అభినందించిన జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం: పాము కాటుకు గురైన ఓ రైతును అనంతపురం పోలీస్ బాంబు స్క్వాడ్ టీమ్ సిబ్బంది సకాలంలో రక్షించి ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందేలా దోహదపడ్డారు. ఆదివారం కంబదూరు మండలం అచ్చంపల్లిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటన ఉండటంతో జిల్లా ఏఆర్ విభాగంలోని బాంబు స్క్వాడ్ సిబ్బంది మహబూబ్ బాషా, హోంగార్డులు శ్రీనివాసులు, తిమ్మరాజులు విధులకు వెళ్లారు. పర్యటన పూర్తవగానే తిరుగు ప్రయాణమయ్యారు. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి వద్ద పాము కాటుకు గురైన రైతు నరసింహులు బంధువులు, భార్య, పిల్లలు రోడ్డుపైకి వచ్చి వాహనాన్ని ఆపి పాము కాటు వేసిన విషయం తెలియజేశారు. వెంటనే స్పందించి రైతు నరసింహులును కంబదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాహనంలో తీసికెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం రైతును కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించి సకాలంలో చికిత్స అందేలా సహాయం చేశారు. ప్రస్తుతం రైతు చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

జనవాక్కు

పిల్లల చదువుకు ఇబ్బంది లేదు



ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తక్కువ కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో పిల్లలను చదివిస్తున్నాం. పేదలకు విద్య భారం కాకూడదని ఉద్దేశంతో సీఎం జగన్ అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి సాయం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మఒడి పథకం ద్వారా నాలుగుసార్లు రూ.54 వేలు అందించారు. అలాగే వైఎస్సార్ ఆసరా కింద రూ.10 వేలు అందింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకొంటు పిల్లలను చదివిస్తున్నాం. గతంలో పిల్లల చదివించాలంటే రోజు కూలీ పనులకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ బెంగ లేదు.

– కవితమ్మ, చర్లోపల్లి, రొళ్ల మండలం

గౌరవంగా జీవిస్తున్నాను



వృద్ధాప్యంలో ఒకరిపై ఆధార పడకుండా గౌరవంగా జీవిస్తున్నాను. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ చేయూత ద్వారా మూడేళ్లుగా ఏడాదికి రూ.18,750 చొప్పున చేయూత ద్వారా లబ్ధి పొందుతున్నాను. కేవలం 0.25 సెంట్లు మాత్రమే వ్యవసాయ భూమి ఉంది. దీంతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాను. మా లాంటి నిరుపేదలకు వైఎస్సార్ చేయూత ద్వారా జగనన్న ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. ఆయన సాయాన్ని జీవితంలో మర్చిపోను.

– ముదుపమ్మ, హనిసేకుంట, రొళ్ల మండలం

సిఫార్సు లేకుండానే పథకాలు



ఏ ఒక్కరి సిపార్సు లేకుండానే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పాలన గొప్పగా ఉంది. పేదలకు ఆయన చేస్తున్న మేలు గతంలో మరెవరూ చేయలేదు. నాకు ప్రతి నెలా ఒకటవ తేదీనే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ఫించన్ సొమ్మును ఇస్తున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేశారు. జగన్ పాలనలో సొంతింటి కలనేరవేరింది. ఈరాష్ట్రానికి మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా వైఎస్. జగనే ఉండాలి.

– గిన్నె సరస్వతి, వజ్రకరూరు

చిన్నారులకు దాతల ఆర్థికసాయం


చిన్నారికి ఆర్థికసాయం చేస్తున్న చంద్రశేఖర్

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌లో నివసిస్తున్న చిన్నారులపై ఈనెల 24న 'సాక్షి'లో ''కంటి దీపాలు... జీవచ్ఛవాలు'' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి దాతలు స్పందిస్తున్నారు. చింతా రామకృష్ణ, శ్రీలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. పుట్టుకతోనే నరాల బలహీనతతో బాధపడుతున్న చిన్నారులను పోషించేందుకు అవస్థలు పడుతున్నారని కథనం ప్రచురితమైంది. ఆదివారం అనంతపురానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ చంద్రశేఖర్ చింతా రామకృష్ణ, శ్రీలక్ష్మి ఇంటికి వచ్చి రూ.15 వేలు నగదును అందించారు. అలాగే ఫోన్‌పే ద్వారా కొంతమంది దాతలు రూ.30 వేల వరకు అకౌంట్‌లోకి డబ్బులు వేశారు. ఇప్పటి వరకు రూ.45 వేలు ఆర్థికసాయం అందిందని చింతా రామకృష్ణ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని వారు విన్నవిస్తున్నారు.

గుప్త నిధుల తవ్వకం ప్రాంతం పరిశీలన


రత్నగిరి గవిమఠం వద్ద గుప్త నిధుల కోసం తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

రొళ్ల: చారిత్రక ప్రదేశమైన రత్నగిరి గ్రామం కొండ పరిసర ప్రాంతం గిరేనాయకనపల్లికి వెళ్లే దారిలోని పురాతన గవిమఠం సమీపంలో ఇటీవల గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం పెద్ద పెద్ద బండరాళ్లను పెకిలించిన విషయం తెలిసిందే. దీంతో సాక్షిలో 'రత్నగిరిలో మళ్లీ గుప్త నిధుల వేట' అనే శీర్షిక ఆదివారం కథనం వెలువడటంతో పోలీసులు స్పందించారు. ఆదివారం సాయంత్రం పురాతన గవిమఠం సమీపంలో గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని కానిస్టేబుల్ నరసింహామూర్తితో కలిసి జమేదార్ రామలింగయ్య పరిశీలించారు. వారం రోజుల క్రితం గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు చేపట్టిన విషయం వాస్తవమేనన్నారు. ఇప్పటి నుంచి రాత్రి వేళల్లో పోలీస్ సిబ్బంది గస్తీ తిరగడంతో పాటు అపరిచితుల వ్యక్తులపై నిఘా పెడతామన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.